



సునిశిత మయిన దృష్టితో ఆ ముష్టివాడి వంకా అతన్ని మాడల్‌గా తీసుకుని వేసిన చిత్ర ద్వయం వేపూ మార్చి మార్చి చూడసాగాడు శంకర్.

అలాగ ఒక్క నిముషం.

శంకర్ ఒక్కసారి మహానందంగా ముష్టివాడి వేపు చూశాడు.

"థాంక్యూ మాడల్....థాంక్యూ...." అతనానందం పట్టలేకపోతున్నాడు.

"మీరేమంటున్నారో నాకు ఆ బాస తెల్దు" చిరాకుగా చూశాడు ముష్టివాడు" నాకాల్లు లాగేస్తన్నాయి నిలుచుని నిలుచుని."

"సారీ....వెరీసారీ....రా.... యిలా కూర్చో.... సోఫా చూపించి తను కూర్చున్నాడు.

# అతని కంటే ఘనుడు

"అడుక్కుతినేవోణ్ణి........అందల వెక్కిస్తానంటారేటి? నాకిక్కడ సాలు" అంటూ నవ్వుతూ ఆర్టిస్ట్ పాదాలవద్ద నేలమీద కూర్చున్నాడు ముష్టివాడు.

"నువ్వింక త్వరలోనే అడుక్కోడం మానేయొచ్చు. చిన్నవ్యాపారం పెట్టుకొని సుఖంగా బ్రతకవొచ్చు"

"మీరేటంటున్నారో నాకరదంకాడం లేదు. నాఅయిదు రూపాయలూ పారేస్తే నా తోవన నేను పోతాను."

"ఇప్పుడు ఐదుకంటె ఎక్కువివ్వలేను. కానీ....ఎల్లుండి కనిపించుతావు కదా? ఐదువేలివ్వగలనని ఆశిస్తున్నాను"

"అయిదువేలా! ఏటిబాబూ. నాతోటేలాకోలం? నేనేటో నా బతుకేటో నాకు తెల్దనుకున్నారేటి...." కొంచెం కోపంగా అన్నాడు ముషివాడు.

ఆర్టిస్ట్ నవ్వాడు. "నీకు—నీ వర్తమానమే తెలుసు. భవిష్యత్తు నాకు తెలుసు. ఆ బొమ్మలు చూడు."

"ఏటుంది సూడ్డానికి? ఆటిని సూత్తే నాలాటి ముష్టోడు అద్దంలో బొమ్మ సూసుకున్నట్లున్నాయి."

"ఆ....అవును అదేకావాలి....అదే రావాలి. మొదటి బొమ్మొక్కటి చూడు. ఏమనిపించుతుందో చెప్పు."

విసుగ్గా చూశాడు అడుక్కు తినేవాడు. "అంగా (అచ్చంగా) అడుక్కు తినే నాయాల్లాగే ఉన్నాడాడు....కళ్ళనిండా వొంటినిండా ఆకలేసుకుని.... అన్నవో రావసెంద్రాని ఏడుత్తున్నట్లు!

ఆర్టిస్ట్ కళ్ళు మెరిశాయి తృప్తితో, ఆనందంతో, గర్వంతో.

"మరి....ఆ రెండో బొమ్మ?"

"ఏటాన్కికీ పరీచ్చ....నాడబ్బులిస్తాను పారేత్తే నా దారిన్నేబోతాను.

గంటలకొద్దీ నిలబెట్టేసింది చాలక అజ్జాడిజ్జాడు (అవి చూడువిచూడు) అంటూ నన్నిలా కాల్చుకుతింటావేటి? బాగానే ఉంది భేరం"

"ప్లీజ్ ....ఇదొక్కటీ ఇదొక్కటే చెప్పు....ఇంకేమీ అడగను." విసుక్కుంటూనే రెండోబొమ్మవేపుచూశాడు చూసి....ఆశ్చర్యపడి.... ఆలోచించి.. "రెండోది నా బొమ్మే....కాని ఆ కళ్ళల్లో ఆకల్లేదు. కడుపునిండినతనముంది సీకటిలేదు. యెలుగురేకుంది"

ఆర్టిస్ట్ ఆనందం పట్టలేకపోయాడు. "ఆ....అదే నాక్కావాలి. అనుకున్నదీ ఆశించిందీ స్పష్టంగా చిత్రించగలగానన్నమాట. మొదటి బొమ్మ ఆకలి. రెండోది ఆకలితీరిన తనం.

నీ భవిష్యత్తు చెబుతాను విను. రేపు చిత్రకళ పోటీ ఉంది. పరస్పర విరుద్ధమయిన భావాలను ప్రతిబింబించే జంట బొమ్మలు....అలాగ. కోరిక—సాఫల్యం భయం—ధైర్యం. చీకటి—వెలుగుఅలాగ నేనేమో చాలా టఫ్ సబ్‌జక్ట్ తీసుకున్నాను. ఆకలితో అలమటింపు,ఆకలి తృప్తి చెందడం. చిత్రం బాగా వొచ్చినట్లే. అంటే రేపు బహుమతి ఖాయమే బహుమతంటే—పదివేలు. నిజంగా నువ్వు తారసిల్లకపోతే నేనింత బాగా గీయగలిగేవాడినికాను. మాడల్‌కొద్దీ చిత్రం నీకు చాలా థాంక్స్....ఎల్లుండి కనిపించు. బహుమతిమొత్తంలో సగం తీసుకువెళ్ళవుగాని....బిజినెస్ చేసుకొని బాగుపడుదువు గాని...."

"మీ థాంక్స్‌కి నానోమెన్షన్. సారీ ఎల్లుండి నేను మిమ్మల్ని కలుసుకోలేకపోవొచ్చు. ఎల్లుండే కాదు. చాలా నెలలవరకూ...."

ఒక్కసారి అతని ఆంగ్లమూ....పద ఉచ్ఛారణ....సంస్కారమూ చదువూ ఉట్టిపడే కంఠమూ....ఆవాక్య నిర్మాణమూ_


ఆర్టిస్ట్ తెల్లముఖం వేశాడు "నువ్వెవరు?"

అతను నవ్వాడు."నాపేరు వంశీ. నేనెవరినయినా కావొచ్చు కానీ, నిజంగా బెగ్గర్‌నిమాత్రం కాను."

"ప్లీజ్. వివరంగా చెప్పు. చెప్పండి"

"ఒక ప్రముఖ దర్శకుడు వ్యాపారపరంగా విజయవంతమయిన అనేక చిత్రాలు తీసినా, తను పశ్చాత్తాపపడుతూ"

"పశ్చాత్తాపమా? దేనికీ? చిత్రాలు మంచి వ్యాపారం చేసుకున్నాయిగా?"



"అందుకే సినిమా డబ్బు చేసుకుందంటే సెక్స్, హింస, అశ్లీలపాటలూ అర్థంలేని కథా, యివేగా? సమాజాన్ని ముందుకు కాక వెనక్కి నడిపించడమే కదా? అతను....ఆదర్శకుడు....తను చేస్తున్నది వెధవపనీ, సమాజ ద్రోహమూ అనే తెలిసినా, డబ్బు సంపాదించే మత్తులో కీర్తియిస్తున్న కిక్కులో.... చాలాకాలం తనని తాను మరచిపోయాడు. ఎందుకోమరి యీ మధ్య హఠాత్తుగా జ్ఞానోదయమైంది. సమాజంలో మనిషిగా దానికి చేయగలిగితే మేలు చేయాలి కాని కీడు చెయ్యడం క్షమార్హం కాని నేరమనీ– అతి శక్తివంతమయిన చలన చిత్ర సాధనాన్ని తను – ప్రజలలో నీచాభిరుచినీ, కుసంస్కారాన్ని కలిగించడానికే వినియోగించుకున్నాడనీ (ఆపరేషన్ చేసి రోగికి స్వస్థత చేకూర్చేందుకుపయోగించవలసిన కత్తిని – హత్యచేయడానికుపయోగించినట్లు) పశ్చాత్తాపపడి.... నిజంగా ప్రేక్షకులలో మంచిఅభిరుచిని కలిగించే, సమాజాన్ని సంస్కరించే ఉత్తమ-వాస్తవ చిత్రం తీసి– చేసిన పాపాన్ని కడుక్కోవాలనుకున్నాడు.

అందుకు – మంచి కథను వెదికి సంపాదించాడు. తీయబోయే సినిమా మంచిని పెంచవలసింది కనుక తీసే విధానం కూడా ఆదర్శవంతంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు.

స్క్రిప్టు చూసి తప్ప – రచయిత పేరు చూసి కాకుండా–

ఒక్కమాటలో– మెరిట్ తప్ప మరేమీ చూడకుండా రైటర్ నుంచి రీరికార్డింగ్ అసిస్టెంట్ వరకూ తీసుకుని మంచి సినిమా తీయాలని అతని ప్రయత్నం. దానిలో ఒకభాగం రేపటి–నటుల ఎన్నిక ముష్టివాడి కళ్ళల్లోంచి మన సమాజ దర్శనం – అదిసబ్జక్టు. కనుక హీరో ముష్టివాడే.


నేను – నటుణ్ని. నటన చూసిన వారు మంచి నటుడినని పదిహేనేళ్ళ నుంచీ అంటున్నారు కాని. అగ్రకులమూ.... సినిమా బంధువులూ... సిఫార్సులూలేక కేవలం నటనమాత్రమే ఉండడంతో సినిమా నటుడిని కాలేకపోయాను. నటనా శక్తి తప్ప మరే శక్తిలేని నాలాంటి వాడికి చిత్రరంగం అందని చందమామే అని సరిపెట్టుకుంటున్నాను. కాని – మొన్న – పై దర్శకుడి ప్రయత్నం గురించి తెలిసింది. రేపు– నటులకి పరీక్ష.

దర్శకుడు వివరించే ముష్టివాడి పాత్రను – సజీవంగా.... రియల్‌గా.... కన్‌విన్సింగ్‌గా అతని ముందు నటించగలగాలి. అలా నటించగలిగిన వాళ్ళు– మినిష్టరుగారి ముద్దు బిడ్డలు కాక




మన హైదరాబాదులో ఎక్కడకి తీసుకెళ్ళమన్నా ఆటోవాళ్ళు రారు. ఇక బస్సులయితే అగపసుకోండి. ఆటోలు గాని, బస్సులు గానీ దొరక్క ఇక్కడ మనం నానా ఇబ్బందీ పడిపోతున్నామా? అవతల న్యూయార్క్‌లో మైక్‌బాక్సర్ అనే టాక్సీ డ్రైవర్. కుక్కలను కూడా టాక్సీలో కూచోబెట్టుకుని షికారుకు తీసుకువెడుతున్నాడట. తమ కుక్కలకు నగరంలోని చూడవలసినవన్నీచూపించి తీసుకురమ్మంటున్నారట చాలామంది కుక్కల యజమానులు.

ఎక్కడ మీదపడి రక్కేస్తాయో అని, ఏ టాక్సీ డ్రైవరు కూడా కుక్కల్ని ఎక్కించుకోడు. అయితే మైక్ అదివరకు అమెరికా ఎయిర్ ఫోర్స్‌లో కుక్కల శిక్షకుడుగా ఉండేవాడు. అతనికి మనుష్యులకన్నా కుక్కలే ఇష్టమట. ఎందుకంటే మనలా అవి వెధవ కబుర్లతో విసిగించవుకదా!



# ఇచ్ఛాపురపు రామచంద్రం

పోయినా.... లంచమివ్వలేకపోయినా... భజన చేయకపోయినా— కేవలం ప్రజ్ఞ మీద- హీరో ఔతారు. ప్యూర్ మెరిట్. ప్రయత్నించాలనిపించింది. ప్రజ్ఞేతప్ప మరేహంగూలేని నాబోటి వాడికిది సువర్ణావకాశమనిపించింది. నానటన.. పాత్రకు సరిపోవడం.... ఎంతటిదో తేల్చుకుందామని— రేపటి పరీక్షకోసం—

ఇవాళ రిహార్సల్స్ చేశాను.

కాఫీ హోటలు ముందు— బిచ్చగాడి అవతారం ధరించి కూర్చున్నాను. రూపంలో.... కంఠంలో.... ఉచ్చారణలో.... ప్రవర్తనలో.... నేను ముష్టివాడిగా ప్రజలను బాగానే సమ్మించగలిగానన్నందుకు నిదర్శనంగా — యివిగో.... రెండు గంటలలో నేను సంపాదించగలిగిన చిల్లర డబ్బులు—" బొచ్చెమీది గుడ్డ తొలగించి చూపాడు బెగ్గర్.

"నాలో—రేపటి పోటీ నెదుర్కొనేందుకు ఆత్మ విశ్వాసం కలుగుతూంది— ఒక్కొక్క నాణెమూ బొచ్చెలో పడుతూంటే.

ఇప్పుడు....మీరు—చిత్రం గీయడం కోసం నన్ను— ఐదు రూపాయలిస్తానని మోడల్‌గా పిలిచి.... రెండు చిత్రాలూగీసి — సంతృప్తి చెందారు. మీరే సంతృప్తి చెందారంటే — నేను జయించానన్న మాటే. అతి సునిశితమైన ఆర్టిస్టయిన మీరే మోడల్‌గా కావలసిన క్లిష్ట భావాలను చూపగలిగాను. మీ వంటి ఆర్టిస్టే నన్ను ముష్టివాడు కాదని గ్రహించలేక పోయారంటే.... పట్టుకోలేక పోయారంటే.... నా వేషానికీ,నటనా సామర్థ్యానికీ యింతకంటె పక్కా సర్టిఫికేటేం కావాలి? మీ ఐదు రూపాయలూ నాకవసరంలేదు. ఎందుకంటే — మీరు అంతకంటె చాలా విలువయిన ఆత్మ విశ్వాసాన్ని నాకు కలిగించారు. అందుకని.

మీ చిత్రానికి రేపు పోటీలో బహుమతిరావాలి. విష్ యు బెస్టాఫ్ లక్..' లేచాడు ముష్టివాడు.

"థాంక్యూ. విష్ యు.. ద సేమ్.." ఆశ్చర్యంలోంచి తేరుకో కుండానే అన్నాడు ఆర్టిస్ట్. ●

# కవి పరిచయం



నేను 1947లో పుట్టినట్లుగా చనిపోయిన మా నాన్నగారు బ్రతికుండగా పలుమార్లు చెప్పారు. తేదీ,నెలా తెలియదు. 1971లో నిప్పురవ్వలు కవితా సంపుటి వెలువడింది. 12 ఏళ్ళ దీర్ఘ విరామం తరువాత 84లో మళ్ళీ సాహితీ రంగప్రవేశం చేసి నిప్పురవ్వలు కవితా సంపుటిని, కొన్ని మార్పులు, కూర్పులతో కొత్తగా చేర్చిన కవితలతో స్వంతంగా ప్రచురించాను. ఆ కవితా సంపుటి (నిప్పురవ్వలు) సమకాలీన కవులు, సుప్రసిద్ధ విమర్శకుల మన్ననలు పొందుతూ వుంది. వృత్తి,వ్యాపారం. నివాసం గుంటూరు.

## కవిత

# నిప్పురవ్వగా వెలిగేందుకు...

ఇన్నేళ్ళ తరువాత
మళ్ళీ మొదలు.
కన్నీళ్ళనీ
అరికాళ్ళలోని ముళ్ళనీ
తుడిచివేసేందుకు:
ఏరివేసేందుకు::-
మనసులోని వ్యధల్ని
హృదయానికి పట్టిన చెదల్ని
అనుభవాలు రగిల్చి మిగిల్చిన
అసంతృప్తిని అవతలకు నెట్టి
మిగిలివున్న కాలాన్ని
నిజమైన జీవన విధానం కొరకు
సద్వినియోగం చేసుకునేందుకు
పరిమాణంలో చిన్నదయినా
ప్రయోగానికీ.... ప్రయోజనానికీ
నిక్కచ్చిగా అక్కరకొచ్చే
నిప్పురవ్వలా వెలిగేందుకు
కాలాన్ని ప్రభావితం చేసేందుకు—
గొంతు విప్పుతున్నాను.
అక్షరాలకు పదును పెడుతున్నాను!!

కొమిశెట్టి శివశంకర్